# మానవత్వమంటే చైతన్యస్వరూపమే!

భానుతేజముకంటె భాసిల్లుచుండును
మంచు తెలుపుకంటె మించియుండు
ఆకాశమునకంటె అతి సూక్ష్మమైయుండు
సర్వజీవులలోన పర్వియుండు
పరమాత్మలేనిది పరమాణువును లేదు
అంతట నిండి తానంటకుండు
పరమాత్మ సందర్శ భవ్య వికాసము
లోకములు మూడింట నిండియుండు

బ్రహ్మమందున నీవు నీలోన బ్రహ్మ
బ్రహ్మయే నీవు నీవె బ్రహ్మయగును
ఇంత కన్నను వేరెద్ది ఎఱుకపరతు
సాధుసద్గుణగణ్యులౌ సభ్యులార !

ప్రేమ స్వరూపులారా !

అనేక రూపనామములతో గోచరించుచున్న యీ చరాచర ప్రపంచమంతయూ కూడను బ్రహ్మనుండి అభివ్యక్తమైనది. బ్రహ్మముచేత, బ్రహ్మలోపలనుండి అభివ్యక్తమైన బ్రహ్మమే యీ ప్రపంచము. ఈ బ్రహ్మము అభివ్యక్తమునకు పూనుకున్నప్పుడే సత్ చిత్ ఆనందము ఏర్పడుతుంది. ఎట్టి ఆధారము లేక తనంతట తాను వుండటమే, సత్! వుండుటయేకాక యెందుకున్నది అనే విషయము తెలుసుకొని స్వరూప జ్ఞానముతో ప్రబోధలు గావించునదే చిత్. స్వరూప జ్ఞానమే ఆనందము. అయితే బ్రహ్మ పదార్థము అభివ్యక్తము కావటానికి కారణం ఏమిటి? ఇది కేవలము తనయొక్క వునికిని చెప్పుకోటమే! దీనినే self evolution అన్నారు. ఇక ఆనందమన్నది ఒక్కతూరి ప్రపంచములో వుట్టిపడునదికాదు. ఇది కేవలము తెరలు



sri sathyasai vachanamrutam

తెరలుగా వచ్చి క్రమక్రమేణా పరిణామము పొందుతుంది. ఇట్టి పరిణామమునే అధ్యాత్మిక పరిణామము అన్నారు. ఈ spiritual evolution అనేది యీనాడు ప్రతి మానవునియందు ప్రత్యేకమైన ఒక స్థానమును చేకూర్చుకొని వున్నది.

**మానవుడు పంచకోశములతో కూడినవాడు**

నిజముగా మానవత్వమంటే చైతన్య స్వరూపమే! సర్వత్రవుండిన చైతన్యమే సర్వజీవులయందు కూడ వున్నది. సర్వజీవులయందున్న చైతన్యమే సర్వత్ర వున్నది. మానవుడనగా కేవలము శరీర, మనోబుద్ధుల సంఘాతము కాదు. మానవుడు అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములలో దాగివున్నాడు. అయితే యిక్కడ ఉపనిషత్తులు యీ పంచకోశములను అతి గౌరవముగను, అతి పవిత్రమైనవిగను, దివ్యమైనవిగను, అర్థవంతమైనవిగను తెలుపుతూ వచ్చినవి. మనము భుజించిన ఆహారము భౌతికరూపము ధరించి నప్పుడు దీనిని ఒక విధమైన స్థూలదేహము అని చెబుతూ వచ్చింది. తదుపరి ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయములు యీ మూడింటియొక్క కూడిక చేతనే లింగ స్వరూపము యేర్పడుతూ వచ్చింది. దీనినే vital body or sense body అంటారు. యింక మూడవది స్వరూప జ్ఞానముతో వుండినదానిని ఆనందమయ కోశము అని చెప్పారు. అయితే ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయములు యీ మూడింటిని తన అదుపులో వుంచుకున్న తత్త్వము ఒకటుంది. అదే అంతరాత్మ. ఈ అంతరాత్మనే 'చైతన్య పురుషుడు' అని చెప్పవచ్చు. ఈ చైతన్య పురుషుడు ఎక్కడ వున్నాడు? 'హృదయేగుహ్యాం' అనగా హృదయములో వుంటున్నాడు, యీ చైతన్య పురుషుడు. హృదయమనగా మన భౌతిక శరీరమునకు సంబంధించిన గుండెకాదు. ఇది ఆధ్యాత్మిక హృదయము, అనంతమైన హృదయము, సర్వవ్యాపకమైన హృదయము. సర్వజ్ఞత్వమైన హృదయము. దీనినే శృతులు 'ఆత్మ' అని చెబుతూ వచ్చాయి. అయితే యీ చైతన్య పురుషునకు అనేక విధములైన రూపములని ఈశావాశ్యోపనిషత్తు వివరించుతూ వచ్చింది.

**శుద్ధసత్త్వ చైతన్యమే సాయితత్త్వము**

భౌతిక చైతన్యముతోకూడిన ఆత్మకు అన్నమయ పురుషుడని పేరు. ఇక రెండవది, ప్రాణమయముతో కూడిన ఆత్మను ప్రాణస్వరూపుడు అని చెబుతూ వచ్చింది. దీనినే life

consciousness అన్నారు. మనోచేతనముతో కూడిన ఆత్మకు మనో పురుషుడని చెబుతూ వచ్చింది. Mental consciousness. ఇంక నాల్గవది అతిమానుషరూపమైనది. అతీత మానసత్వమని దీనికి పేరు. అతీత మానసత్వముతో కూడిన చైతన్యమును అతి మానుష స్వరూపము అన్నారు. వేదములు, ఉపనిషత్తులు దీనిని అనేక విధములుగా వివరిస్తూ వచ్చాయి. దీనినే 'బృహత్' అనికూడను చెబుతూ వచ్చారు. దీనినే 'ఋతం' అని చెబుతూ వచ్చారు. దీనినే 'సత్యమ్' అని చెబుతూ వచ్చారు. ఇలాంటి అతీతమైన, అతి మానస స్వరూపమైన పురుషత్వమును దివ్యత్వముగా పోల్చుకుంటూ వచ్చారు. ఈ అతీతమైనది Super mind అంటారు ఇలాంటి Supermind తత్త్వమును విజ్ఞానమయ పురుషుడన్నారు.

ఈ విజ్ఞానమయ పురుషుడు తరువాత ఆనందమయ పురుషుడు వుంటున్నాడు. అదే supermind consciousness. క్రమక్రమేణా దీనిని Universal consciousness అని చెబుతూ వచ్చారు. అనగా విశ్వవ్యాప్తమైన చైతన్యస్వరూపుడు. ఈ అన్నింటికి మించి ఒక చైతన్యము వుంటున్నది. అదే చిత్ తపస్. ఇది అన్ని చైతన్యములకును మూలాధారమైన చైతన్యము. All effective will అన్నారు దీనిని. ఇట్టి చైతన్య స్వరూపమును ధరించిన దాన్ని Super divine life అన్నారు. శుద్ధ సత్త్వచైతన్యము అన్నారు. అదే సాయి తత్త్వము ఆ స్థాయి యందుండిన తత్త్వము చేయలేనిది ఒక్కటి కూడను వుండదు. ఈ శుద్ధ తత్త్వమనేది సర్వశక్తులతో కూడినది. ఇటి శుద్ధ తత్త్వాన్ని గుర్తించుకోటానికి ప్రయత్నించటమే ప్రతి మానవునియొక్క కర్తవ్యము. దీనిని గుర్తించటానికి చక్కని మార్గములుంటున్నాయి. మానవుని దృష్టి నిరంతరము బాహ్యప్రపంచమునందే ప్రవేశిస్తుంటాది. అట్టి బయటి ప్రపంచములోపల ప్రసరించే దివ్యదృష్టిని అంతర్ముఖము గావించాలి. తన యందున్న చైతన్య తత్త్వమును తాను ఆవిర్భవింపజేసుకోవాలి. అలా ఆవిర్భవింపజేసుకున్న దివ్యచైతన్యమునకు తాను అర్పితము గావాలి. దీనిని సాధించాలనే దీక్ష చాలా కచ్చితంగా పెట్టుకోవాలి. దీనిని realisation of the inner divine అన్నారు. కనుక మనలో అంతర్ముఖమైన దివ్యత్వమును మొట్టమొదట అభివృద్ధి గావించుకోటానికి ప్రయత్నించాలి.

**ఒకే భగవంతుడు సర్వజీవులయందు భిన్న భిన్న రూపములతో ఉన్నాడనే సత్యమును**

sri sathyasaivachanamrutam

### గుర్తించుకోవాలి

ఇంక రెండవది, తన యొక్క జీవితములో అవ్యక్తముగా వుండిన చైతన్యమే సర్వత్ర అవ్యక్తముగా వున్నదనే సత్యాన్ని గుర్తించాలి. తన ప్రపంచమునకు, తన ప్రక్కన వున్న వాని ప్రపంచమునకు మధ్యలో మాయ లేక యింకే విధమైన భ్రమయో ఒక అడ్డుగోడగా నిలచి వున్నది అనే దానిని గుర్తించి ఆ అడ్డుగోడను తీసివేయటానికి తగిన ప్రయత్నము చేయాలి. అప్పుడే తన, పర అనే భేదము లేకుండా ఏకత్వమును కొంతవరకు అనుభవించటానికి ప్రయత్నిస్తాడు. 'అహంయేవ యిదం సర్వం' నేనే యీ సర్వమునందు వుండినవాడిని, యీ సర్వము నా యందే వున్నది అనే స్థితికి తాను వస్తాడు. 'నేనే దైవము దైవమే నేను' 'నేనే బ్రహ్మ బ్రహ్మమే నేను' నాకు, బ్రహ్మకు వ్యత్యాసము లేదు అనే స్థాయికి చేరి 'ఒకే దేవుడు సర్వులయందుకూడను భిన్న రూపములతో వున్నాడు' అనే సత్యము గుర్తించుకోవాలి. దీనినే realisation of the cosmic divine అన్నారు. ఈ రెండవ స్థాయిని మనము సాధించిన తరువాత మూడవది ఒకటి వున్నది. దీనిని ఆరోహణ, అవరోహణ అన్నారు. ఈ ascend and descend అనే దానిలో క్రిందికి రావటము, పైకి పోవటము.

### బ్రహ్మ పదార్థమే బాహ్య జగత్తుగా రూపొందుతూ వచ్చింది

మానవునకు యీ లోకములో ఆరు విధములైన మనసులు వుంటున్నవి. ఒకటి సామాన్యమైన మనస్సు. రెండవది అతీతమైన మనస్సు super mind మూడవది ఉన్నతమైన మనస్సు, higher mind. నాల్గవది ప్రకాశవంతమైన మనస్సు, Illuminated mind. ఐదవది స్వయం స్మరణ మనస్సు, Intuitive mind యింక ఆరవది ఉపరిభాగములో వున్న మనస్సు, Over mind . ఈ ఆరు మనస్సులు కూడను మొట్టమొదట సామాన్య మనస్సునుండి ప్రారంభమై over mind వరకు రావటము. అనగా ఉపరిభాగమైన మనస్సువరకు రావటము తిరిగి ఉపరిభాగమైన మనస్సు నుంచి సామాన్యమైన మనస్సువరకు దిగి రావటము. యీ విధముగా క్రిందకు రావటము, పైకి పోవటము యీ రెండింటియొక్క చేరిక కలిగినప్పుడే పరిపూర్ణమైన మానవత్వము కలుగుతుంది. యిదే ఆరోహణ, అవరోహణ అన్నారు. అయితే యీ రెండింటిని చేర్చటమే పరిపూర్ణత్వము. అప్పుడే 'పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే'. అంతా



srisathyasaivachanamrutam

పూర్ణమే అయిపోతుంది. ఈ చైతన్యము, ఆ చైతన్యము అనే భేదము లేదు. సర్వము చైతన్యమయమే! కారణమేమనగా బ్రహ్మ పదార్థమే యీ బాహ్యజగత్తుగా రూపొందుతూ వచ్చింది.

**ప్రకృతియొక్క క్రమానుగతమైన వికాసమే పరిణామము**

ఈనాడు ప్రపంచమంతయు పరిణామవాదమును గురించి అనేక విధములుగా చర్చించుచున్నారు. పరిణామ వాదమును అందరూ విశ్వసిస్తున్నారు. అయితే, యీ ప్రకృతియొక్క పరిణామ తత్త్వము మనము కొంతవరకు గుర్తించటానికి ప్రయత్నించాలి. పరిణామమనగా యేమంటే ప్రకృతియొక్క క్రమానుగతమైన వికాసమే పరిణామము. దీనికి ఒక చిన్న ఉదాహరణము. పదార్థమునుండి ప్రాణము పుట్టింది. ప్రాణమునుండి మనస్సు పుట్టింది. అయితే పదార్థము అంటే ఏమిటి? ప్రాణము కప్పుకున్న తెరయే పదార్థము. వడ్లు అంటే ఏమిటి? పొరతో కప్పుకున్న బియ్యమును వడ్లు అంటాము. ఈ పొర వుండినంతవరకు వడ్లంటున్నాము. పొర తీసివేస్తే బియ్యము అవుతాయి. కాబట్టి, పదార్థమనే పొరను కప్పుకొని ప్రాణము వుంటున్నది. ఏతావాతా యీ పదార్థమునుండి ప్రాణము పుడుతూవచ్చింది. ఈ ప్రాణమునుంచే మనస్సు పుడుతూ వచ్చింది. ప్రతి మానవుని పరిణామము పదార్థమునుండి ప్రాణమువరకు తిరిగి ప్రాణమునుండి మనస్సువరకు జరుగుతూ వస్తుండాది. కానీ, అక్కడనుండికూడను పరిణామము జరిగి చివరకు పూర్తికావాలి. ఈ పరిణామము పూర్తి కానప్పుడు మానవత్వము పూర్తికాదు. ఈ మనస్సునుండి అతీతమైన మనస్సుకు రావాలి. అతీత మనస్సునుండి సచ్చిదానంద మనస్సువరకు వెళ్లాలి. అంతవరకు వెళ్లకుండిన వీడు పరిపూర్ణ మానవుడు కాడు. ఏదైన ఒక ఫలము పిందెగా పుట్టి కాయగా తయారై పరిపక్వస్థితికి రావాలంటే దానిలో మాధుర్యము రావాలి. పరిపూర్ణమైన ఫలముగా అయినప్పుడు చెట్టునుండి ఫలము వేరైపోతుంది. అదే వైరాగ్యము. ఆ సచ్చిదానందస్థితి మనలో ఆవిర్భవించాలి. ఆ సచ్చిదానంద స్థితిని మానవుడు యేనాడు అనుభవిస్తాడో అదే పవిత్రమైన శివరాత్రి. ఇక, అన్ని రాత్రులు చీకటి రాత్రులే! కనుక, తనయందున్న అపరిపక్వమైన మానవత్వమును పరిపక్వస్థితికి తెప్పించుకోవాలి. ఇలాంటి పరిపక్వ స్థితికి రావాలంటే మనము యీనాడు

srisathyasaivachanamrutam

వున్న మానసికస్థాయినుండి ఒక అతీత మానసికస్థాయికి వెళ్ళాలి. మనస్సుయొక్క పరిణామమే మానవుని జీవితము. ఈ పరిణామములో అనేక రకములైన మార్పులు, చేర్పులు జరుగుతూ వుంటాయి. ప్రపంచములో విద్యుత్‌శక్తి, అణుశక్తి వున్నదని కొద్ది కాలముక్రితమే తెలుసుకున్నాము. కాని, మనకు తెలియకుండా పోయినంతమాత్రమున విద్యుత్‌శక్తి, అణుశక్తి లేదని చెప్పటం మూర్ఖత్వము కాదా! యీనాడు మానవుడు మనఃస్థాయిలోనే వుండటంచేత తనకు తెలియనివన్నీ ప్రపంచములో లేవు అని వాదిస్తున్నాడు. ఇదే మూర్ఖత్వము! తెలియనివి లేవని చెప్పటానికి ఎవ్వరికి యేమాత్రంకూడను అధికారం లేదు. నిన్న తెలియనిదానిని యీనాడు మనం తెల్సుకున్నాము. ఈనాడు తెలియనిది రేపు తెలుసుకోవచ్చు. తెలుసుకొనుటకై ప్రయత్నించాలి గాని తెలియని దానిని లేదని చెప్పటము పెద్ద అజ్ఞానము. ఈ అజ్ఞానము ఎప్పుడు మనకు సంభవిస్తుంది? దేహాభిమానమునే లక్ష్యములో వుంచుకున్న వ్యక్తిని యిలాంటి అజ్ఞానము ఆవరిస్తుంది. ఇది కేవలము ఆహారముచేత యేర్పడిన దోషము.

**మానవుడు నిజముగా సచ్చిదానంద స్వరూపుడే!**

దీనికంటె యింకా అతీతమైనది ఒకటివుంది. దానినే 'లింగదేహము' అన్నారు. మానవుడు యిలాంటి దేహమువరకు ప్రయాణము చెయ్యాలి. దీనినే subtle body అన్నారు. క్రమక్రమేణా ప్రయాణము సల్పుతూ ఆనందస్థితికి చేరుకోవాలి. ఆనందమే అన్నింటికి మూలాధారము. ఈనాడు జగత్తులో కన్పించే ప్రతి పదార్థమునందుకూడను యీ ఆనందము సూక్ష్మరూపములో వుంది. మనము ఉపనిషత్తులు చదువుతున్నాము. భగవద్గీత పఠిస్తున్నాము. బ్రహ్మసూత్రములను వల్లిస్తున్నాము. మనలో కల్గిన మార్పు యేమిటి? ఈ మార్పు లేనివన్నీకూడను వ్యర్థమైనవే కనుక క్రమక్రమేణా యీ పరిణామమనేది మనలో కలగాలి. మనము ఎన్ని విధములైన సాధనలు చేసినప్పటికిని మనోస్థాయియందే వుంటుంటే యింక ముందుకు పోవటానికి ఏది మార్గము? Super Mind వరకు మనము వెళ్లాలి. ఈ అతీత మనస్సులో మనము ప్రవేశించినప్పుడే మనము ప్రపంచమునకు, పరమాత్మ తత్త్వమునకు వుండిన సంబంధ బాంధవ్యము యేమిటని కొంతవరకునైనా అర్థము చేసుకోగలము. నిజముగా మనము సచ్చిదానంద స్వరూపులమే! మన వునికి నిరంతరము వుంటూనే వుంది. 'జాగ్రదవస్థలో

srisathyasaivachanamrutam

నేను వున్నాను' అని నీవు చెబుతున్నావు. స్వప్నావస్థలో నీ శరీరమును నీవు మరచిపోయావు. కానీ అక్కడకూడా నీవు వుంటున్నావు. సంఘవ్యవస్థయందు కూడను 'నీవు' వుంటున్నావు. ఈ మూడు స్థానములందుకూడను నీ వునికి యే మాత్రము మారలేదు. ఆ సత్యమును నీవు గుర్తించటానికి ప్రయత్నించాలి. అట్టి పవిత్రమైన సత్యమును గుర్తింపచేయటానికి ప్రయత్నం చేసినప్పుడే యీ విధమైన సాధనలన్నీ ఫలిస్తాయి.

మనం చేసే సాధనలద్వారా యే స్థాయికి మనం చేరుతున్నాము, ఏ విధమైన పరిణామము మనలో జరిగింది, అనే విషయాన్ని మనము విచారించాలి. ఈ ఆరోహణ, అవరోహణలలోపల మనయొక్క జీవితమును క్రమక్రమేణా ప్రవేశపెట్టాలి. ఈ మానసికస్థాయినుండి పరిపూర్ణమైన ఉపరిస్థాయికి మనము వెళ్లాలి. అలాంటి పవిత్రమైన దివ్యస్థాయికి చేరటానికి చాలా ప్రయత్నం చేయాలి.

**ఆధ్యాత్మిక మార్గముకంటె సులభమైన మార్గము జగత్తులో లేదు**

ప్రేమస్వరూపులారా! ఇది మీకు చాలా కష్టమని భావించుకోవచ్చు. నిజముగా శ్రద్ధపెడితే యిది చాలా సులభమైన మార్గము. అధ్యాత్మిక మార్గముకంటె అతి సులభమైన మార్గము యీ జగత్తులో కానరాదు. శ్రద్ధ లేకపోవటంచేత యివన్నీ మనకు కష్టముగాను, భారముగాను అనిపిస్తున్నాయి. పట్టుబడితే యిలలో సాధించలేనిది ఒక్కటీ లేదు. దీనినే 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్' అన్నారు. కనుక 'నేను నిరంతరము చైతన్య స్వరూపుడను, సచ్చిదానందము నా దివ్య ఆకారము', అని మీరు స్మరిస్తూండాలి. ఈనాడు మానవుడు తన స్వస్వరూపమును మరచి కేవలము దేహేంద్రియ మనోబుద్ధులయొక్క భావములే దృష్టియందు వుంచుకున్నాడు. మన భావములన్నింటికి మూలాధారమై సచ్చిదానందము వుంటుంది. ఆనందము మనయొక్క రూపమే! కనుకనే మానవుడు నిరంతరము ఆనందమునే ఆశిస్తున్నాడు. జగత్తంతయు పరబ్రహ్మస్వరూపము. పరబ్రహ్మ పదార్థమువలనే పరబ్రహ్మ పదార్థములోనే ఆత్మపుట్టింది. అయితే యీ పరబ్రహ్మము పదార్థముగా మనకు గోచరిస్తున్నది. ఈ పదార్థమునుండియే పరార్థము కూడను ప్రారంభమవుతుంది. దీనినే పరిణామస్థితి అన్నారు. ఒక కోడిగ్రుడ్డు వుంది. అది చూస్తే మనకొక పదార్థముగా గోచరిస్తుంది. కాని క్రమక్రమేణా దాని యొక్క పరిణామము,

sri sathyasai vahini amrutam

స్థితిగతులు చేయవలసిన రీతిగా చేసినప్పుడు అందులోనే ఒక ప్రాణంకూడను ఆవిర్భవిస్తుంది. ఈ సృష్టిలో కనుపించే ప్రతి పదార్థములోకూడను ఒక విధమైన చైతన్య శక్తి వుంటుంది. సర్వత్ర నిండిన చైతన్యమును మన మీనాడు తెలుసుకోవాలి. తనయందున్న చైతన్యమే సర్వత్ర వుందనే సత్యాన్ని గుర్తించాలి. యీ చైతన్యతత్వమును ప్రయత్నపూర్వకముగా సాధించాలి.

**అహంకారము ఉండినంతవరకు ఆత్మతత్త్వము అర్థము కాదు**

ఇప్పుడు ఉన్నత మనస్సు అనేది వుంది. ఈ ఉన్నత మనస్సంటే యేమిటి? జగత్ భావములనుండి దివ్యభావములో ప్రవేశించటానికి పూనుకోవటమే ఉన్నత మనస్సవుతుంది. దీనికి ఒక చిన్న ఉదాహరణము matter + Mind యిది సామాన్య జీవితము. కానీ matter + Being అదే అతీత మనస్సు. ఈనాడు మనస్సుతోనే కాకుండా మన యొక్క దివ్యత్వముతో వునికితో దానిని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈ మనస్సు కేవలం ఒక విధమైన అయోమయ స్థితిని కల్పిస్తుంది. అనేక విధములుగా ఆకర్షిస్తుంది. అనేక విధములైన గుణములను పురికొల్పుతుంది. అభిమాన, మమకారములను పెంచుతుంది. అహంకారమువరకు తీసుకుని పోతుంది. ఇట్టి అహంకారములోపల కన్నుమిన్ను కానక నిత్యానిత్య విషయ పరిశీలన మర్చిపోతాడు, మానవుడు. ఈత చెట్టు తన మెడకు కల్లు కుండను కట్టుకుంటుంది. కానీ అది చాలా జంభంగా నిల్చి వుంటుంది. ఇది సిగ్గు చేటు కదా! కట్టుకొని వున్నది, కల్లుకుండ! ఇక జంభము ఎక్కడనుండి వచ్చింది? ఇది బుద్ధి తక్కువ కాదా! ఈ విధముగా విషయవాసనలు, అహంకారము అనే వాటిని మెడకు కట్టుకొని 'నేను ఒక మానవుడను, మానవుడను' అని చెప్పుకుంటున్నాము. ఇది ఎంత సిగ్గు చేటు! అహంకారము ఏనాడు చంపుకుంటామో ఆనాడే ఆత్మస్థితి అనేది మనము గుర్తించుకోటానికి వీలవుతుంది. అహంకారము వుండినంతవరకు ఆత్మ విషయము అర్థమే కాదు. అర్థము కానివాడు ఎన్ని గ్రంథములు చదివినా, ఎన్ని ఉపవ్యాసములు విన్నా, ఎంత పేరు పొందినా, కేవలం వ్యర్థుడే. ఈ అహంకారమును మొట్టమొదట చంపుకోవాలి. అప్పుడే మనలో చైతన్యమనేది ఆవిర్భవిస్తుంది. మనలో వున్న చైతన్యము జగత్ సర్వత్రా వుంటున్నది. ఆ ఏకాత్మభావమైన చైతన్యమును మన మీనాడు గుర్తించటానికి ప్రయత్నించాలి.

sri sathyasai vachanamrutam

## దేహములు మార్పుచెందవచ్చును, దాని దేహి మార్పుచెందనివానిగా ఉంటాడు

ప్రేమస్వరూపులారా! మనము అనేక సాధనలు చేస్తున్నాము. ఈ జగత్తంతా అనిత్యము అంటున్నాము. ఈ జగత్తంతా భ్రమ అంటున్నాము. ఈ జగత్తుమ మిధ్య అంటున్నాము. చాలా పొరపాటు. నేను సత్యము. నీవు సత్యము. ఈ జగత్తంతా సత్యమే! అంతా చైతన్యమయమే! ఇదంతా బ్రహ్మ పదార్థముయొక్క స్వరూపమే! ఈ ఏకాత్మ భావాన్ని మనము అభివృద్ధిపరచుకున్నప్పుడే అంతో యింతో దివ్యత్వమనేది మనకు అర్థమవుతుంది. 'ఈ జగత్తంతా మిధ్య, యిదంతా అనిత్యము, యిది ఒకమాయ', అని యీ విధముగా చెప్పుకుంటూ పోతుంటే యిది కేవలము ప్రజలను వంచితము చేసేది అవుతుంది. యిది తప్పు. సత్య ప్రమాణము కాదు. అయితే ఈ మిధ్యయైన జగత్తునందు నీ మిధ్యా ప్రబోధలెందుకు? అదే మిధ్యయై పోతుందిగదా, మరి! కాదు, కాదు ఇది సత్యమే! 'సత్యస్య సత్యం' సత్యములోని సత్యమే యిది. జగత్తులోని యీ సత్యమును మనము గుర్తించుకున్నప్పుడు మనలో వున్న సత్యాన్ని గుర్తించుకోటానికి ఒక అర్హత కలుగుతుంది. జగత్తు సత్యమే! ఆకారములు మారవచ్చును, పదార్థములు మార్పుకావచ్చు, దేహములు కొంతవరకు మార్పు రావచ్చును, కాని దేహి మార్పు చెందనిదిగా వుంటాడు. యిది పదార్థముల మార్పుచేత కలిగే పరిణామము కానీ, సమస్త పదార్థములకు మూలాధారమైన సత్యము ఒక్కటి వుంటున్నాది. అదే 'అస్తి భాతి ప్రియం'. అదే 'సత్ చిత్ ఆనందము'. అదే 'సత్యం, శివం సుందరం'.

## దివ్యమైన మనస్సునుండి సచ్చిదానందమువరకు మన ప్రయాణము సాగిస్తూ ఉండాలి

మార్పుచెందే దేహమును ఆధారముగా చేసుకొని జగత్తంతా మిధ్యయని, జగత్తంతా అసత్యమని, జగత్తంతా మాయ అని చెప్పకూడదు. మాయ ఎట్లా అవుతుంది? ఇది కేవలం చైతన్య పదార్థమునుంచే బ్రహ్మపదార్థమునుంచే ఆవిర్భవించింది. పిల్లల ప్రీతి నిమిత్తమై మార్కెటులోపల చిలుకలు, పక్షులు, మృగములు యింక అనేక విధములైన చక్కెర బొమ్మలను చేసి పెడతారు. ఒకరు ఒక దానిని ఆశించి చప్పరించవచ్చు. ఒకరు పక్షి అని భ్రమించి ఆ పక్షిని చప్పరించవచ్చు. ఇంకొకరు యింకొక విధముగా భావించి చప్పరించవచ్చును. ఆ రూపనామములు మార్పు చెందుచున్నవిగానీ అందరూ చప్పరించేది చక్కెరయొక్క స్వరూపమే!

sri sathyasai vahamrutam

ఇవన్నీ చక్కెర బొమ్మలు. ఆ చక్కెరయే బ్రహ్మ పదార్థము. పరిణామము సహజమే! కానీ, దానిలోని మాధుర్యముకూడా దానికి సహజమే! ఈ విధముగా పరిణామము చెందే దేహము పరిపూర్ణమైన దివ్యత్వమును అనుభవిస్తుండాది. ఎంతకాలమైనప్పటికి మనము ఈ ప్రైమరీక్లాసులో కూర్చొని యేదో కొన్ని సాధనలు చేసుకుంటూ కూర్చోటం చాలదు. క్రమక్రమేణా ఉన్నత స్థాయికి పోవటానికి ప్రయత్నం చేయాలి. కేవలము ఒక పదార్థమునుంచి ప్రాణమువరకు గంతువేసింది, ఈ చైతన్యము. ప్రాణమునుంచి మనస్సువరకు గంతులు వేసింది, ఈ బ్రహ్మతత్త్వము. అంతటితోటే నిల్చిపోతే మానవుడు పరిపూర్ణుడు కాడు. తాను చేరవలసిన గమ్యమును చేరాలి. తిరిగి గంతువెయ్యాలి, ఆమనస్ తత్త్వమునుండి దివ్యమైన మనస్సుకు, దివ్యమైన మనస్సునుండి సచ్చిదానందమువరకు తన ప్రయాణము సాగిస్తూ పోవాలి. ఈ మారుతూ వుండే పదార్థములనే మనము ఆధారముగా తీసుకొని వుండరాదు. అలావుంటే మనము అనేక రకములైన యిక్కట్లకు గురికావలసివస్తుంది. అన్నింటికి మూలాధారమైన తత్త్వముతో మనము సంబంధమేర్పరచుకోవాలి.

**మనము ఈనాడు పరార్థ పరిశోధనలు సల్పాలి**

ప్రతి మానవుడుకూడను తన సాధనస్థాయిని ఉత్తమమైన, పవిత్రమైన ఉపరిభాగమైన over mind వరకు పెంచుకుంటూ రావాలి. దీనినే 'విజ్ఞానమయము' అన్నారు. Super intellectual mind, దీనినే విజ్ఞానమయ కోశము అన్నారు. ఈ విజ్ఞానమయ కోశములో మనము ప్రవేశించాలి. ఈనాటి విజ్ఞానము ఇది కాదు. ఆధునిక విజ్ఞానము పదార్థ పరిశోధనా విజ్ఞానము. కానీ Super intellectual mind అనేది పరార్థ పరిశోధన మార్గము. మనము ఈనాడు పరార్థ పరిశోధనలు సల్పాలి. అదీ నిజమైన విజ్ఞానమయకోశము. ఆ విజ్ఞానమయకోశములో మనము పరిపూర్ణులమైతిమా అదియే ఆనందమయ కోశము. అదియే Super conscious mind అన్నారు. ఆ విధమైన స్థితిని పొందాలి. ఇది చాలా సులభమైన మార్గము. నీవది కష్టముగా భావించుకోవచ్చుగాని ప్రయత్నము చేయకపోవటంచేతనే అది కష్టముగా అనిపిస్తున్నాది. ప్రయత్నము చేయండి. నా మాటలు వినండి. దాన్ని అనుసరించండి. దానిని నేను చూపుతాను. అంతేగాని, మాటలు మాత్రమే విని ఆచరణలో పెట్టకపోతే గమ్యము

srisathyasaivachanamrutam

చేరలేరు.

**ప్రకృతియొక్క క్రమ పరిణామ వికాసమే యీ జగత్తు**

మనకు పరిపూర్ణమైన స్థితి యీ ఉపరిభాగమునందే కలుగుతుంది. ఇది ఒక పుష్పము. ఇది పుట్టినప్పుడు మొగ్గగా వుంది. ఇది మొగ్గగా వుండినప్పుడు దీనియొక్క వాసన వేరే విధముగా వుంటున్నది. ప్రకృతియొక్క పరిణామము చేత క్రమక్రమేణా పరిపూర్ణ స్థితికి వచ్చేటప్పటికి దానిలో పరిమళముకూడను సుగంధముగా మారిపోతుంది. పెరుగుతూ పెరుగుతూ వస్తే దానిలో పవిత్రత పెరుగుతూ వస్తుంది. ఈ పరిణామము ప్రతి పదార్థమునకు, ప్రతి వ్యక్తికి, ప్రతి విషయమునకు వుంటున్నది. అప్పటికప్పుడు పుట్టిన బిడ్డ ఆకారము వేరుగా వుంటుంది. అప్పుడు పేరుకూడను వేరుగా వుంటుంది. ఆశిశువును పసిబిడ్డ Child అంటాము. ఆ బిడ్డ క్రమక్రమేణ ప్రకృతి పరిణామము ననుసరించి పెరిగి పది సంవత్సరములవరకు వచ్చేటప్పటికి పేరుకూడా మారుతుంది. అప్పుడు Boy అని పిలుస్తాము. ఇంకా పెరుగుతూ పోయి ముప్పై సంవత్సరములు వచ్చేటప్పటికి Man అని పిలుస్తాము. చివరకు 75 సంవత్సరములు వచ్చేటప్పటికి grand father అని పిలుస్తాము. ఈ విధంగా పరిణామమును పురస్కరించుకొని రూపనామములుకూడను మారుతుంటాయి.

కనుక, మొదటిస్థితిలో వుండిన మనసు పరిణామస్థితివల్ల Supermind గా మారిపోతుంది. తరువాత higher mind గా వచ్చేస్తుంది. తరువాత Intellectual mind గా వచ్చేస్తుంది. అయితే యీ అన్నింటియందు వున్నది ఒక్కటే! Child, man, grand father ఒక వ్యక్తియే! అదే యేకత్వము. యివన్నీ పరిణామము యొక్క స్వరూపములు. కనుక ప్రకృతియొక్క క్రమ పరిణామ వికాసమే యీ జగత్తు. ఈ చైతన్యమంతా కేవలము బ్రహ్మ పదార్థముయొక్క చైతన్యమే!

ప్రేమ స్వరూపులారా! ఈ బ్రహ్మ పదార్థముయొక్క చైతన్యమును ప్రతి వ్యక్తి కూడను చవిచూడడానికి తగిన కృషి చేయండి. అదే సత్యము. అదే జ్ఞానము. అదే అనంతము. కనుక, యీ అనంతమైన తత్త్వాన్ని కొంతవరకు గుర్తించటానికి పూనుకోండి. మనస్సు క్రమక్రమేణా దివ్యమార్గములో, పవిత్రమైన మార్గములో కొంత సాధనలు చేస్తూ వుంటుంటే మొదటి స్థానమునుండి పవిత్ర స్థానమునకు చేరుకుంటుంది. నామస్మరణ ఎందుకోసం పెట్టారు?

sri sathyasai vachanamrutam

నిరంతరము జగత్ చింతన చేయకుండా కొంతవరకునైనా భగవత్ చింతన చేస్తూవుంటే యీ మనస్సు క్రమేణా ఉన్నతస్థాయికి చేరుతుంది. ఈ రాత్రి అంతా పవిత్రమైన నామస్మరణ చేస్తే మీ మనస్సుకూడను వున్నతమైన Super mind కాకపోయినప్పటికి, Higher mind కాకపోయినప్పకి, ఒక పవిత్రమైన mind స్థాయికైనా చేరుకోగలుగుతుంది. ఉన్న స్థాయికంటె కొంచెము ఉత్తమస్థాయికి చేరుతుంది. 'సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ' తత్త్వాన్ని మనస్సునందు నిరంతరము చింతించుచూ, జపించుచూ, తరించటానికి ప్రయత్నం చేయండి.

**(తేదీ. 16-02-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam